

www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 22 జులై 2024



వైభవంగా గురుపౌర్ణమి గరుడ సేవ



ప్రజాశక్తి- తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో ఆదివారం రాత్రి 7 గంటలకు గరుడ వాహన సేవ ప్రారంభమైంది. సర్వాలంకార భూషితుడైన శ్రీమలయప్ప స్వామివారు గరుడునిపై ఆలయ మాడ వీధుల్లో విహరించి భక్తులను దర్శనమిచ్చారు. వాహనసేవలో తిరుమల పెద్ద జీయర్‌స్వామి, చిన్న జీయర్ స్వామి, ఆలయ డెప్యూటీ ఈవో లోకనాథం పాల్గొన్నారు.

117 జీవోను రద్దు చేయాలి: యుటిఎఫ్



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజ

ప్రజాశక్తి- తిరుపతి టౌన్
ఆంధ్రప్రదేశ్‌లో గత కొన్ని సంవత్సరాలుగా వస్తున్న విచ్ఛిన్నకర ధోరణులు తొలగిపోయి ప్రభుత్వ విద్యారంగం బలోపేతం కావాలంటే పాఠశాలలను విలీనం చేస్తూ ఇచ్చిన 117 జీవోను వెంటనే రద్దు చేయాలని యుటిఎఫ్ డిమాండ్ చేసింది. ఆదివారం తిరుపతిలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో ఉద్యమ శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్.నాయుడు ప్రారంభోపన్యాసం చేశారు. ఆయన మాట్లాడుతూ ఒక కిలోమీటర్ దూరంలోని ప్రాథమిక పాఠశాలల్లోని మూడు, నాలుగు, ఐదు తరగతుల విద్యార్థులను సమీప ఉన్నత పాఠశాలల్లో విలీనం చేస్తూ తీసుకువచ్చిన 117 జీవో ద్వారా ప్రాథమిక పాఠశాలలకు తీవ్రనష్టం వాటిల్లిందని, దాని ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో చేరే పిల్లల సంఖ్య గణనీయంగా తగ్గిపోయిందని అన్నారు. దీన్ని సవరించి ప్రాథమిక పాఠశాలలు బలోపేతం కావాలంటే పాఠశాలల విలీనానికి కారణమైన 117 జీఓను రద్దు చేసి ప్రాథమిక పాఠశాలు ఒకటి నుండి 5వ తరగతి వరకు నడిచేటట్లు చూడాలని కోరారు. రాష్ట్ర సహాధ్యక్షులు సురేష్ కుమార్ మాట్లాడుతూ యుటిఎఫ్ మొదటి నుండి విద్యారంగం శ్రేయస్సు కోసం పనిచేస్తుందని, ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం చేయడానికి అనేకరకాల కార్యక్రమాలను రూపొందించి అమలు చేస్తోందని అన్నారు. విద్యావ్యవస్థలో సానుకూల సంస్కరణలకు స్వాగతం పలుకుతున్నామని, అయితే అవి విచ్ఛిన్నకరమైన సంస్కరణలుగా ఉండకుండా విద్యార్థులకు ఉపయోగకరమైనవిగా ఉండాలని తెలిపారు. లక్ష్మీరాజా మాట్లాడుతూ ఉపాధ్యాయుల సంక్షేమం కోసం నిరంతరం పోరాటం చేసే యుటిఎఫ్, 50 ఏళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకుని స్వర్ణోత్సవ సంవత్సరంలో అడుగుపెట్టిందని రాబోయే డిసెంబర్లో జరిగే స్వర్ణోత్సవ మహాసభలను జయప్రదం చేయడానికి ప్రతి యూటీఎఫ్ కార్యకర్త కంకణబద్ధులై కృషి చేయాలని తెలిపారు. రాష్ట్ర మహాసభల సందర్భంగా ఉపాధ్యాయులకు వివిధ రకాల ఆటల పోటీలు, సాంస్కృతిక అంశాల పైన పోటీలు నిర్వహిస్తామన్నారు. అదేవిధంగా సాంస్కృతిక ప్రదర్శనలు ఇవ్వడానికి అవకాశం కల్పిస్తున్నామని, వాటిలో ఉపాధ్యాయులందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూటీఎఫ్ పూర్వ గౌరవాధ్యక్షులు రాధాకృష్ణ, తిరుపతి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జిజె.రాజశేఖర్, ముత్యాల రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దేవరాల నిర్మల, జిల్లా సహాధ్యక్షులు కెవిఎస్‌బి.సూర్యప్రకాష్, కందల శ్రీదేవి, కోశాధికారి రమేష్ నాయుడు, జిల్లా కార్యదర్శులు దండు రామచంద్రయ్య, కుమారస్వామి, కె.ప్రభాకర్, హరిబాబు, శేఖర్, పద్మజ, మోహన్ బాబు, వెంకటకృష్ణ, విజయకుమార్, గీతమ్మ, విజయశ్రీ పాల్గొన్నారు.

చైతన్యవంతమైన ఆలోచనలతోనే

ఉజ్వల భవిష్యత్తు సాధ్యం

ప్రజాశక్తి- క్యాంపస్: సమాజంలో విజయం సాధించాలంటే చైతన్యవంతమైన ఆలోచనలతో విద్యార్థులు ముందుకెళ్ళాలని, అప్పుడే ఉజ్వల భవిష్యత్తును అందుకోవచ్చని శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఇన్చార్జ్ వీసీ ఆచార్య సీహెచ్ అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు పేర్కొన్నారు. ఆదివారం ఎస్వీయూ ఆర్ట్స్ బ్లాక్ ఆడిటోరియంలో జరిగిన దూరవిద్య విభాగం సైకాలజీ విద్యార్థుల వీడ్కోలు సభకు వారిరువురూ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దూరవిద్య విభాగంలో నాణ్యమైన విద్యను, మెటీరియల్స్‌ను అందజేస్తూ విద్యార్థులకు ఉన్నత విద్యను అందజేస్తోందన్నారు. ప్రత్యేకించి దూరవిద్యలో సైకాలజీ విభాగానికి ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. ఎంతో మంది ప్రముఖులు సైకాలజీలో ఉన్నత విద్యను అభ్యసించారన్నారు. విద్యార్థులు, పరిశోధకుల ప్రగతి అవసరమైన చర్యలు తీసుకోవడంలో పరిపాలన విభాగం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. పట్టభద్రులైన విద్యార్థులు సమాజాభివృద్ధికి పాటుపడాలని పిలుపునిచ్చారు. నిరంతరం సేవా భావాన్ని చాటుతూ ముందుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఇన్చార్జి వీసీ, రిజిస్ట్రార్‌లను విద్యార్థులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆచార్య విశ్వనాథరెడ్డి, ఆచార్య కుమార్ రెడ్డి, డాక్టర్ ఈ.ఫల్గుణకుమార్ తదితరులు పాల్గొన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మూలం రమేష్

మోడీకి మోకరిల్లొద్దు..

రాష్ట్ర ప్రయోజనాలకై పట్టుబట్టండి..

జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో సీపీఎం రాష్ట్ర నేతలు

ప్రజాశక్తి- తిరుపతి టౌన్:
రాష్ట్రంలో అధికారంలో ఉన్న టిడిపి కూటమి ప్రభుత్వం ప్రధాని మోడీకి మోకరిల్లకుండా రాష్ట్ర ప్రయోజనాల కోసం పట్టుబట్టాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మూలం రమేష్, దడాల సుబ్బారావు డిమాండ్ చేశారు. ఆదివారం యశోదానగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో సీపీఎం నగర కార్యదర్శి టి.సుబ్రమణ్యం అధ్యక్షతన జరిగిన జిల్లా విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సుబ్బారావు, మూలం రమేష్ మాట్లాడుతూ కార్మిక, ఉద్యోగ, ప్రజావ్యతిరేక విధానాలు అవలంబించడం వల్లనే వైఎస్‌ఆర్సీపీ ప్రభుత్వాన్ని ప్రజలు ఓడించారని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు నెలల కాకుండానే అంగన్వాడీ, ఆశ వర్కర్లపై రాజకీయ వేధింపులకు పాల్పడటమే కాకుండా ఉద్యోగాలు తొలగిస్తామని బెదిరించడం మానుకోకపోతే ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. ప్రతిపక్ష పార్టీలపై వేధించడం, హత్యలు చేయడం, తప్పుడు కేసులు పెట్టడం లాంటి సంస్కృతిని విడనాడి ప్రజాస్వామ్యాన్ని కాపడాలన్నారు. వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్లు రద్దుచేస్తామని హామి ఇచ్చి, ఇప్పుడు మళ్ళీ స్మార్ట్ మీటర్లు కొనసాగిస్తామని ప్రభుత్వం ప్రకటించడాన్ని తప్పుబట్టారు. నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. స్కీమ్ వర్కర్లపై రాజకీయ వేధింపులకు వ్యతిరేకంగా తీర్మానాన్ని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు కందారపు మురళి ప్రవేశపెట్టారు. అనంతరం సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ జిల్లాలో వున్న ప్రజా సమస్యలపై సీపీఎం పోరాడుతుందని తెలిపారు. సెప్టెంబర్ నెల నుండి శాఖ, మండల, పట్టణ, జిల్లా వారీగా పార్టీ మహాసభలు జరుగుతాయని తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు అంగేరి పుల్లయ్య, దాసరి జనార్ధన్, నాయకులు పాల్గొన్నారు.

బాధ్యతతో ప్రజలకు సేవచేయండి

మీ అందరి సహకారం మరువలేనిది: కమిషనర్ అదితి సింగ్



ప్రజాశక్తి- తిరుపతి టౌన్: ఉద్యోగాన్ని ఒక బాధ్యతగా భావించి, ప్రజలకు సేవలు అందించాలని, విధుల్లో మీరందరూ అందించిన సహకారం మరువలేనిదని నగరపాలక సంస్థ కమిషనర్ అదితి సింగ్ అన్నారు. కమిషనర్ అదితి సింగ్ కడప జాయింట్ కలెక్టర్‌గా ఉద్యోగోన్నతిపై వెళుతున్న సందర్భంగా ఆదివారం మున్సిపల్ సమావేశ మందిరంలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదితి సింగ్ మాట్లాడుతూ ఉద్యోగులు అందరూ తమ విధులను బాధ్యతతో నిర్వహించాలన్నారు. ఎన్నికల విధుల్లో అధికారులు, సిబ్బంది అంతా తనకు ఎంతో సహకరించారని, తాను వచ్చి కొద్ది కాలమే అయినా ఇక్కడ పనిచేసినా ప్రతి ఒక్కరూ తనకు బాగా సహకరించారని మీ సహకారం మరువలేనిది అన్నారు. తాను ఉద్యోగోన్నతిపై వెళ్ళినా, ఎక్కడ విధులు నిర్వహించినా ఇక్కడ పనిచేసిన కాలం జీవితంలో గుర్తుండి పోతుందన్నారు. అన్ని విభాగాల అధికారులు తమస్థాయికి మించి సహకరించారని అన్నారు. రానున్న అధికారులను కూడా ఇదే విధంగా సహకరించి, సంస్థ పురోభివృద్ధి పనిచేయాలన్నారు. ఎన్నికల వేళ మా అందరినీ ఒక తాటిపై తీసుకువచ్చి ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు మీరు చేసిన కృషి గొప్పదని నగరపాలక సంస్థ అధికారులు కమిషనర్‌ను కొనియాడారు. మీ వద్ద నుండి ఓపిగ్గా పనిచేసే విధానాన్ని మేమందరూ నేర్చుకున్నమని పలువురు అధికారులు అన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డెప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మునిసిపల్ ఇంజినీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, స్మార్ట్ సిటి జిఎం.చంద్రమౌళి, ఆర్‌ఓలు సేతుమాధవ్, కేఎల్.వర్మ, హెల్త్ ఆఫీసర్ యువ అన్వేష్ రెడ్డి, సెక్రటరీ రాధిక, డిసిపి శ్రీనివాసులు, మేనేజర్ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ వేధింపులకు నిరసనగా

నేడు కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: రాజకీయ వేధింపులకు నిరసనగా 22వ తేదీ సోమవారం తిరుపతి జిల్లా కలెక్టరేట్ ఎదుట స్కీమ్ వర్కర్ల ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందరపు మురళి ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. అంగన్వాడి, ఆశా, సంఘమిత్ర, ఫీల్డ్ అసిస్టెంట్లు, మధ్యాహ్న భోజనం తదితర రంగాలకు చెందిన వాళ్లు రాజకీయ వేధింపులకు గురై ఇబ్బందులు పడుతున్నారని, మీమీ ప్రాంతాల్లో బాధితులు ఉంటే ఆయా రంగాల నుంచి, ప్రాంతాల నుంచి రాగలరని కోరారు. ధర్నా తర్వాత కలెక్టర్‌కి మెమోరాండం సమర్పించడం జరుగుతుందన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన టిటిడి ఉద్యోగులు

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: టిటిడి జనరల్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ సంఘ నాయకులు, సంఘ సభ్యులు బుల్లెట రమణ ఆధ్వర్యంలో తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుని ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు ఎమ్మెల్యేతో మాట్లాడుతూ రాబోయే కాలంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు, వైకుంఠ ఏకాదశి, ద్వాదశిలు అత్యంత ముఖ్యమైన ఉత్సవాలు సమయంలో టిటిడి ఉద్యోగుల బంధువులు శ్రీవారి దర్శనానికి వస్తారని, కనుక 10మందికి రూ.300ల శ్రీవారి దర్శనం టిక్కెట్లు ఇప్పించేలా కృషిచేయాలని కోరారు. టిటిడి ఉద్యోగుల కుటుంబాలకు వైకుంఠ ఏకాదశి, ద్వాదశిల రోజుల్లో దర్శనం భాగ్యం కలిగించే విధంగా స్టాండర్డు ఆర్డర్స్ ఇవ్వడానికి టిటిడి యాజమాన్యంకు సిఫార్సు చేయాలన్నారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. ఆ సంఘం అధ్యక్షులు అమ్మిటి మునివెంకట రెడ్డి, ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, కోశాధికారి ఎన్ఎల్‌వి రవికుమార్, దేవేంద్రబాబు, సుబ్రహ్మణ్యం, కరుణాకర్, చెన్నయ్య, గోపి, వెంకట్రావు, ఆది నారాయణరెడ్డి, హేమ కుమార్, ఎంఎస్ఎస్ రాయుడు, శివ రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్యో నారాయణ 'హరి'

- పరిసరాల పరిశుభ్రతో ఆరోగ్యం భద్రం

డిఎం అండ్ హెచ్‌వో డాక్టరు యు.శ్రీహరి

ఇంటర్వ్యూ




డయేరియా బాధితుల్ని ఆసుపత్రికి తరలిస్తున్న డిఎంహెచ్ఓ శ్రీహరి

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: ప్రజల ప్రాణాలను కాపాడే వైద్యులు దేవుడితో సమానం అంటూ వైద్యో నారాయణ హరి అన్నారు పెద్దలు. ప్రతి ఒకరికి ఆరోగ్యం అనేది చాలా ముఖ్యం. దానిని కాపాడుకునేందుకు రకరకాల ప్రయత్నలు చేస్తారు. జిల్లాలోని ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం జిల్లా వైద్యశాఖ నిరంతరం కృషి చేస్తోంది. వర్షాకాలం వచ్చిందంటే చాలు సీజనల్ వ్యాధులతో ప్రజలు అనారోగ్యానికి గురవుతుంటారు. ఆసుపత్రులకు వరసకడుతుంటారు. అతిసారం, మలేరియా, చికెన్‌గున్యా, డెంగీ వంటి సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్న ప్రస్తుత తరుణంలో జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా నివారణకు తీసుకుంటున్న చర్యలపై డిఎంఅండ్‌హెచ్‌వో డాక్టరు యు.శ్రీహరి మాటలతో తెలుసుకుంది.

ప్రజాశక్తి: జిల్లాలో ఇటీవల జరిగిన డయేరియా ఘటనలకు కారణాలు?

డిఎంహెచ్‌వో: తిరుపతి జిల్లా ఇటీవల కాలంలో ప్రదానం నాలుగు చోట్ల డయేరియా విజృంభించింది. తిరుపతి పాస్ వికాస్ కేంద్రం (మానసిక వికలాంగుల ఆశ్రమం)లో ఇందులో 18 మంది డయేరియా బారినపడ్డారు. ఇద్దరు మృతి చెందారు. గూడురు డివిజన్‌లోని చెన్నారు ఎస్‌ట వెల్ఫర్ హాస్టల్ విద్యార్థులకు, నాయుడుపేటలోని గురుకుల హాస్టల్ విద్యార్థులకు. కెవిబిపురం మండలంలోని కాడ్రిపల్లి డయేరియా సోకింది. వీటికి ప్రదాన కారణం అపరిశుభ్రతో, ఆహారం సక్రమంగా లేకపోవడం వల్ల ఇది ప్రభల్లింది.

ప్రజాశక్తి: ఇప్పటి వరకు ఎన్ని డయేరియా కేసులు నమోదయ్యాయి?

డిఎంహెచ్‌వో: తిరుపతి జిల్లాలో ఇప్పటి వరకు 185 డయేరియా కేసులు, 92 టైఫాయిడ్, 18 చికున్‌గున్యా, 7 విస్ఫోస్టయికో కేసులు నమోదు అయ్యాయి.

ప్రజాశక్తి: ప్రజల్లో అవగాహనకు కల్పించేందుకు తీసుకున్న చర్యలు?

డిఎంహెచ్‌వో : నిత్యం ఆశా వర్కర్లు ద్వారా ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేస్తూ, అవగాహన కల్పిస్తున్నాం. గత నెల 28న కలెక్టర్ ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా ఉన్న నీటి ట్యాంకులన్నీ ఖాళీ చేయించి డ్రైడే అమలు చేశాం. నమూనాలను ల్యాబ్‌కు పంపి పరీక్షలు చేయించాం. తిరుపతి రూరల్ దామినేడు ప్రాంతం తప్ప మిగతా అన్ని ప్రాంతాల్లోనూ పరిశుభ్రంగా ఉన్నట్లు ఫలితాలు వచ్చాయి. దామినేడు ప్రాంతం మురికివాడ కావడంతకో కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీ అవసరమైన చర్యలు తీసుకోంటుంది. ఇటీవల చెన్నూర్ వసతిగృహంలో అపరిశుభ్రమైన నీటితో 17 మంది విద్యార్థులు, కాట్రపల్లిలో జాతరలో మాంసాహారం తినడంతో 17 మంది అతిసార బారినపడ్డారు. ఈ రెండు ఘటనలకు కారణమైన వారిపై చర్యలు తీసుకున్నాం. కల్తీ ఆహారానికి కారణమైన ఐదు ఫాస్ట్‌ఫుడ్ హోటళ్లను మూయించాం.

ప్రజాశక్తి: ప్రజలు ఏమైన చర్యలు పాటించాలా?

డిఎంహెచ్‌వో: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. కాచి చల్లార్చిన నీటిని తాగడం, భోజనం వేడిగా ఉన్నప్పుడే తినడం వలన రోగాలు మన చెంతకు రావు. ప్రధానంగా వర్షాలుపడే సందర్భంలో మురుగు కాలువలు పక్కనే చేసిన ఫాస్ట్‌ఫుడ్ తినడం రోగాలను కొనితెచ్చుకోవడమే. మాంసాన్ని ఎక్కువ రోజులు నిల్వచేసి తినడం ఆరోగ్యానికి ప్రమాదం. జాతర్లు, ఉత్సవాల సందర్భంలో నిర్వహకులు ఏఎన్‌శ్రీంలను సంప్రదించాలి. వారు ఆహారం పరిశీలించి జాగ్రత్తలు చెబుతారు.

ప్రజాశక్తి: వ్యాధులు ప్రబలకుండా పర్యవేక్షణ చర్యలు ఏంటి?

డిఎంహెచ్‌వో: జిల్లాలో అతిసారం, ఇతర సీజనల్ వ్యాధుల నివారణకు జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేశాం. దీనికి కలెక్టర్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. డిఎంహెచ్‌వో, డిపివో, డిఈవో, ఆర్అండ్ డబ్ల్యుఎస్, ఐసిడిఎస్ జిల్లాస్థాయి అధికారులంతా సభ్యులుగా ఉన్నారు. వీరంతా వారి వారి విభాగాల్లో శుభ్రత ప్రమాణాలు పాటించేలా పర్యవేక్షించాలి. ప్రధానంగా పాఠశాలలు, వసతిగృహాలు, అంగన్‌వాడీలు, గ్రామీణ ప్రాంతాల్లో శుభ్రమైన తాగునీరు, పారిశుద్ధం పక్కాగా అమలు చేస్తున్నారా? లేదా..? అనేది పర్యవేక్షించి కలెక్టర్‌కు నివేదిక ఇవ్వాలి. ఇదే తరహాలో మున్సిపాలిటీలు, మండల కేంద్రాల్లో కమిటీలు పని చేస్తున్నాయి.

ప్రజాశక్తి: నివారణకు ప్రభుత్వ చర్యలు ఏంటి?

డిఎంహెచ్‌వో : సీజనల్ వ్యాధులు విజృంభించకుండా కట్టడికి జులై 1 నుంచి ఆగస్టు 30వ తేదీ వరకు స్టాప్ డయేరియా క్యాంపెయిన్‌కు ప్రభుత్వం పిలుపునిచ్చింది. అందులో భాగంగా జిల్లాలోని ప్రతి ఇంటికి వెళ్లి ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఉచితంగా పంపిణి చేసి, డయేరియా కట్టడిపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం. గ్రామీణస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు ఈకార్యక్రమాన్ని అమలు చేస్తున్నాం. అందులో భాగంగా ఇప్పటి వరకు టీకాలు వేయించుకోని పిల్లలకు టీకాలు వేయిస్తాం. జులైలో డెంగీ కట్టడిపై దృష్టి సారించాం. గ్రామాలు, పట్టణాల పరిధిలో చెత్తపేరుకుపోయినా, మురుగునీరు నిలిచిపోయినా, డ్రైనేజీలు పొంగినా ఏఎన్ఎంలు పోటో తీసి ప్రత్యేక యాప్‌లో సంబంధిత అధికారులకు పంపిస్తారు. వారు చర్యలు తీసుకున్నాకే ఆ యాప్‌లో ఒకే అని వస్తుంది. తిరుపతి నగరంలో జీవకోన, లెప్రసీకాలనీ, స్కావెంజర్స్ కాలనీల్లో మురుగునీటి కట్టడికి చర్యలు తీసుకుంటున్నాం.

ప్రజాశక్తి: ప్రజల అనుమానుల నివృత్తి ఎలా చేస్తారు?

డిఎంహెచ్‌వో: డయేరియా, ఇతర సీజనల్ వ్యాధుల భారిన పడినప్పుడు వైద్యులను సంప్రదించకుండా దుకాణాల్లో మందులు తీసుకుని వాడటం శ్రేయస్కరం కాదు. వెంటనే ఆసుపత్రికి వెళ్లి చికిత్స తీసుకోవాలి. వ్యాధుల నివారణ, సందేహాలపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ కేంద్రం ఏర్పాటు చేశాం. సందేహాల నివృత్తికి 99087 93170 ఫోన్ నెంబరను సంప్రదించాలి.

ప్రజాశక్తి: బాధితులకు త్వరతగతి చికిత్స అందించేందుకు ఏలాంటి చర్యలు తీసుకున్నారు?

డిఎంహెచ్‌వో : సీజనల్ వ్యాధుల బారిన పడిన వారికి చికిత్స త్వరగతిన చికిత్స అందించేందుకు ఇప్పటికే పలు చర్యలు చేపట్టాం. జిల్లా వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో 58, పట్టణాల్లో 28 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలున్నాయి. మూడువేల నుంచి ఐదువేల జనాభా పరిధిలో ఒక ఆశా వర్కర్, ఏఎన్ఎం, హెల్త్ అధికారి అందుబాటులో ఉన్నారు. జిల్లాలోని 439 హెల్త్ క్లినిక్‌లోని సిబ్బంది సీజనల్ వ్యాధులపై ఎప్పకటిప్పడు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. అతిసారం రోగుల కోసం 50 ప్రత్యేక పడకలను ఏర్పాటు చేశాం. తిరుపతి రుయా ఆసుపత్రిలో 30, శ్రీకాళహస్తి ప్రభుత్వ ఆసుపత్రిలో 10, గుడూరు ప్రభుత్వ ఆసుపత్రిలో మరో 10పడకలను ఇప్పటికే ఏర్పాటు చేశాం.

ప్రజాశక్తి: ప్రజలకు మీరిచ్చే సూచన?

డిఎంహెచ్‌వో: ప్రస్తుత వర్షాకాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని జాగ్రత్తగా వ్యవహరించాలి. పరిసరాలను నిత్యం పరిశుభ్రంగా ఉంచుకోవాలి. కల్తీ, నిల్వచేసిన ఆహారాన్ని తినకండి, మాంసాహారాన్ని నిల్వ చేస్తే తినడం ఆరోగ్యానికి హానికరం. నీటిని కాచి వడబోసి సేవించడం ఉత్తమం.

ప్రజాశక్తి: శాఖల సమన్వయం ఎలా ఉంది?

డిఎంహెచ్‌వో: జిల్లా వ్యాప్తంగా వ్యాధులు ప్రభల కుండా ఉండాలంటే అన్ని శాఖల సమన్వయంతో ముందుకు వెళ్లాలి. మున్సిపాలిటి, ఆర్‌ఎస్‌డబ్ల్యు, జిల్లా ఆరోగ్యశాఖ, ఐసిడిఎస్ ఇలా అన్ని విభాగాలు వారివారి పరిధిలో పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టిపెట్టాలి. జిల్లా కలెక్టరు వీరందర్ని సమన్వయం చేసుకుంటూ ఇప్పటికే పలు చర్యలు చేపట్టారు. రాబోవు రోజుల్లో కూడా వ్యాధులు ప్రబలకుండా జిల్లా యంత్రాంగం మొత్తం అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉంది.

కేంద్రాన్ని విభజన హామీలు అడిగే ధైర్యం లేదా: తులసి రెడ్డి

ప్రజాశక్తి- తిరుపతి (మంగళం): ఆంధ్ర రాష్ట్రవిభజన సమయంలో నవ్యాంధ్రప్రదేశ్ ఆర్థికంగా అన్ని ప్రాంతాలు సమతుల్యంతో అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ పార్టీ సీమాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ, విశాఖకు రైల్వేజోన్, మెట్రో రైల్ ఇలా అనేక వరాలు అమలై ఉంటే ఏపీ సుభిక్షంగా ఉండేదని కాంగ్రెస్ పార్టీ మీడియా ఛైర్మన్ తులసి రెడ్డి అన్నారు. ఆదివారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విభజన సమయంలో నవ్యాంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఇచ్చిన హామీలను కూడా అడిగే ధైర్యంలేని వారు పాలన కొనసాగిస్తున్నారని విమర్శించారు. 2014 తర్వాత నవ్యాంధ్రకు ముఖ్యమంత్రి అయిన చంద్రబాబు, 2019లో సీఎం అయిన జగన్ మోహన్ రెడ్డి ప్రత్యేక హోదా అంశం గాని, విభజన హామీల అమలుకు కేంద్రంపై చిత్తశుద్ధితో ప్రయత్నాలు చేయలేదన్నారు. కేంద్రంలో 2014, 2019లో బిజెపికి పూర్తి మెజారిటీ ఉండేదని, కానీ 2024లో ఆ పరిస్థితి లేదన్నారు. ఇప్పుడు ప్రత్యేక హోదా, విభజన హామీల అమలుకు సరైన సమయమని కేంద్రంపై ఒత్తిడి తెస్తే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మంచి జరుగుతుందని అన్నారు. గత ప్రభుత్వం కన్నా ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ గాడి తప్పిందని, ఏదో ఒక హింసాత్మక ఘటన ప్రతిరోజు జరుగుతూనే ఉండడం కలవరపాటుకు గురిచేస్తుందన్నారు. ఈ పరిస్థితి ఇలానే కొనసాగితే జగన్మోహన్ రెడ్డికి పట్టిన గతి కూటమి ప్రభుత్వానికి ఐదు నెలల్లో పడుతుందని హెచ్చరించారు. రాష్ట్రంలో టిడిపి, వైసిపి ఎన్ని ప్రతి దాడులు చేసుకుంటున్న బిజెపితో మాత్రం అంటగాగి ఉంటారని స్పష్టం చేశారు. ఇకనైనా రాష్ట్ర ప్రయోజనాలపై చంద్రబాబు దృష్టి సారించకపోతే ఇబ్బందులు ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు ప్రమీలమ్మ, మాంగాటి గోపాల్ రెడ్డి, రాంభూపాల్ రెడ్డి, పార్థసారధి రెడ్డి, చిట్టిబాబు, సోమశేఖర్ రెడ్డి, శివ శంకర్, నన్నేఖాన్, నరేంద్రబాబు, గోపిగౌడ్ పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న తులసి రెడ్డి

అన్నదానం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ప్రముఖ సీరియల్ నిర్మాత పల్లమాల సుధాకర్ తండ్రి జ్ఞాపకార్థం ధర్మరాజులస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన అగ్నిగుండ మహోత్సవానికి విచ్చేసిన భక్తులకు అన్నదానం చేశారు. తనతండ్రి జ్ఞాపకార్థం వందలాదిగా వచ్చిన భక్తులకు అన్నదానం చేయడం ఆనందంగా ఉందని సుధాకర్ తెలిపారు. ప్రతి ఏడాది తన తండ్రి జ్ఞాపకార్థం ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తానని తెలిపారు. పట్టాభి, సిద్ధులు ప్రసాద్, పల్లమాల శ్రీకాంత్ పల్లమాల శశాంత్, నారాయణ, చిరంజీవులు, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.



ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : డిఎస్‌ఆర్ కమ్యూనిటీ హాలులో సుశీల నేత్రాలయకి చెందిన ప్రముఖ డాక్టర్ సుధాకర్ రావు పర్యవేక్షణలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం ప్రగతి సేవా సంస్థ అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ ఆదివారం ప్రారంభించారు. ఈ ఉచిత వైద్య కంటి శిబిరంలో గూడూరు పట్టణ పరిసర ప్రాంతాల నుండి 110 మంది హాజరై కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఆపరేషన్లు అవసరమైన వారిని నెల్లూరు తరలించి ఉచిత కంటి ఆపరేషన్లు చేయించి తిరిగి వారిని వారి గమ్యస్థానానికి చేర్చనున్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ ఉపాధ్యక్షులు బండి ధనంజయ రెడ్డి, కార్యదర్శి జి చంద్రశేఖర్, సుశీల, నేత్రాలయ కంటి వైద్య నిపుణులు పిఆర్‌ఓ నాగార్జున, ప్రగతి సేవా సంస్థ కార్యవర్గ సభ్యులు పీడీ కరీముల్లా, నక్కా రామకృష్ణ, ఠక్కర్ ఎస్‌వి ప్రభాకర్, కోట వెంకటేశ్వర్లు, ఆక్వా రమేష్, పోతిరెడ్డి పెంచలయ్య, కృష్ణారెడ్డి, వెంకటేశ్వర్లు, వాకాటి శ్రీను పాల్గొన్నారు.

ఆలయానికి బోరు మోటారు వితరణ


ఆలయానికి బోరు మోటారును వితరణ చేసిన దాతలు

ప్రజాశక్తి- తిరుపతి డెస్క్: ఏర్పేడు మండలం కుక్కల గుంట లోని ఆల లింగేశ్వర స్వామి దేవస్థానానికి బత్తల మునిరత్నం నాయుడు, లక్ష్మమ్మ జ్ఞాపకార్థం వారి కుమారులు బత్తల బాబు నాయుడు, బత్తల గిరి నాయుడు ఆలయానికి బోరు మోటారును ఆదివారం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త నిత్య జ్ఞానానంద స్వామి, హేమసుందరం, పద్మనాభ నాయుడు, రత్నం యాదవ్, సుధాకర్ నాయుడు, సురేష్ నాయుడు, రాజా, మురళినాయుడు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి -రామచంద్రాపురం: రామచంద్రాపురం మండలంలోని రాయల చెరువు పేటలో తిరుపతికి చెందిన డిఎస్‌ఆర్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి సౌజన్యంతో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్యులు డాక్టర్ నారాయణరెడ్డి, డాక్టర్ చైతన్య, డాక్టర్ సంగీత వైద్య బృందం సుమారు వందమంది కి పైగా వివిధ రకాల వైద్య పరీక్షలు చేశారు. టిడిపి మండల అధ్యక్షుడు తిరుమలరెడ్డి హాజరై వ్యాధిగ్రస్తులకు డాక్టర్ నారాయణరెడ్డి తో కలిసి ఉచిత మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రతి వ్యక్తి ఆరోగ్యం పై ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు తిరుమలరెడ్డి, మాధవి, నాగభూషణం, టిడిపి నాయకులు లోకనాథం యాదవ్, చిన్నబ్బరెడ్డి , వైద్యులు పాల్గొన్నారు.

బీహార్‌ను తలపిస్తున్న ఏపీ: వైసిపి

ప్రజాశక్తి - క్యాంపస్: రాష్ట్రంలో చూస్తున్న అధికార పార్టీ నేతలు ప్రతిపక్ష పార్టీ నేతల, కార్యకర్తల పై దాడులు దౌర్జన్యాలు చూస్తుంటే ఆంధ్రప్రదేశ్ మరో బీహార్ ను తలపిస్తోందని వైసిపి విద్యార్థి సంఘం నేత మనం ప్రేమ్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీ అంబేద్కర్ విగ్రహం ఎదుట వైసిపి విద్యార్థి విభాగం నాయకులు 'చలో ఢిల్లీ..సేవ్ ఏపీ పోస్టర్'ను ఆదివారం ఆవిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏపీలో జరుగుతున్న కూటమి ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుండి హింసాకాండ, అత్యాచారాలు ఎక్కువ య్యాయని వాపోయారు. ఈ పాలన పోయి ఏపీలో రాష్ట్రపతి పాలన పెట్టాలని కోరారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఢిల్లీలో నిర్వహించనున్న మహా ధర్నాకు మద్దతుగా తిరుపతి నుండి పెద్ద ఎత్తున విద్యార్థులు, నాయకులు, కార్యకర్తలు వెళతారన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా నాయకులు పసుపులేటి సురేష్, ఉప సర్పంచ్ మల్లి మొగ్గల ఉమాపతి ,ముని, నరేష్ ,దినేష్, మధు, పవన్, చరణ్ సోము, సింహాద్రి పాల్గొన్నారు.

వెటర్నరీ వర్సిటీ అభివృద్ధికి కృషి: ఇన్‌ఛార్జి విసి

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం అభివృద్ధికి కృషి చేయనున్నట్లు ఇన్‌ఛార్జి విసి జెవి రమణ పేర్కొన్నారు. శ్రీ వెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం నూతన ఇన్‌ఛార్జి ఉపకులపతిగా నియమితులైన ఆచార్య జె వి రమణ వీసీ చాంబర్లో ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్సిటీలోని బోధన, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థుల సహకారంతో వర్సిటీని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తానన్నారు. వర్సిటీలో పలువురు ఆచార్యులు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

జిల్లా మెసెంజర్ల కార్యవర్గ ఎన్నిక

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: జిల్లా మెసెంజర్ల కార్యవర్గాన్ని ఆదివారం స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఎన్నుకున్నారు. స్టేట్ మెసెంజర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పోటూరు రవి ఆధ్వర్యంలో తిరుపతి జిల్లా మెసెంజర్ల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా వి మునిరత్నం (జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయం తిరుపతి), ఉపాధ్యక్షులుగా ఎ పెంచలయ్య (పెళ్లకూరు), ప్రధాన కార్యదర్శిగా కె బి ప్రశాంత్ (శ్రీకాళహస్తి), సహాయ కార్యదర్శిగా డి హేమలత(కెవిబిపురం), ట్రెజరర్‌గా కె సుబ్రహ్మణ్యం(బివిన్ కండ్రిగ), సహ ట్రెజరర్ గా షాహీన, గౌరవ అధ్యక్షులుగా ఆనంద్ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

క్యాన్సర్‌పై అప్రమత్తంగా ఉండాలి


క్యాన్సర్ నివారణపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్థానిక బాబు అగ్రహారం మున్సిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో అవధార మానవత్రిక తొట్టిపడ వాలంటీర్షిప్ సందర్భంగా టాటా, స్విథార్ క్యాన్సర్ హాస్పిటల్, రష్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ డాక్టర్ల బృందంచే ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి సతీమణి బొజ్జల బృందమ్మ ప్రారంభించారు. ప్రతి మనిషి జీవితంలో ఆరోగ్యమే చాలా ముఖ్యమైనది, అందులోనూ క్యాన్సర్ సోకకుండా జాగ్రత్త పడాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ నిపుణుల నిర్వాహక వైద్యులు సుధాకర్, గుడిమల్లం చైర్మన్ గిరినాయుడు, టీడీపీ పట్టణ అధ్యక్షులు విజయ కుమార్ నాయుడు, కన్నావరం హరిబాబు, ముప్పెరి సురేంద్రబాబు, రమణారెడ్డి, పోతల రాజకుమార్ పాల్గొన్నారు.

'ఆశ'లపై కక్ష సాధింపులు మానుకోవాలి

ప్రజాశక్తి -బాలాయపల్లి : అధికార పార్టీ నాయకులు మండలంలోని సుబ్బాపుడు గ్రామ దళిత ఆశ వర్కర్ కస్తూరి కృష్ణ వేణి పై రాజకీయ కక్ష సాధింపులు మానుకోవాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఆయన మాట్లాడుతూ టిడిపిలోకి వచ్చిన రెండు నెలలకే 18 ఏళ్ల నుంచి వైద్య సేవలు అందించిన కృష్ణవేణిని విధుల నుంచి తొలగించాలని కక్ష సాధింపు చర్యలకు అధికార పార్టీ నాయకులు పూనుకోవడం బెదిరింపు అవుతుందన్నారు. కక్ష సాధింపులు మానుకోకుంటే ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆశవర్కర్ల తిరుపతి జిల్లా అధ్యక్షురాలు కవిత, మండలంలోని ఆశవర్కర్ కె. గోపిమ్మ లు పాల్గొన్నారు.

పారిశుధ్యం అస్తవ్యస్తం

- దోమల విజృంభణ
- జ్వరాలు వ్యాపిస్తాయని భయాందోళన




ప్రజాశక్తి- వెంకటగిరి: పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. దోమలు విపరీతం కావడంతో విష జ్వరాల బారిన పడాల్సి వస్తుందోనేమని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. వెంకటగిరి మున్సిపాలిటీలో దోమల బెడద అధికమైంది. చీకటి పడితే చాలు ముసురుతున్న దోమలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దోమల బెడదను తట్టుకునేందుకు ప్రజలు మస్కిటో కాయిల్స్, అగర్ వత్తులు, దోమ తెరలు వినియోగించాల్సి వస్తోంది. చీకటి పడితే చాలు దోమల భరింపలేక పోతున్నామని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దోమల నివారణకు మున్సిపాలిటీ ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. సాధారణంగా సాయంత్రం వేళల్లో ఇంటి తలుపులు తెరిచి ఉంచుతారు. కానీ వెంకటగిరిలో దోమల బెడద వల్ల తలుపులు మూసి ఉంచే పరిస్థితి నెలకొంది. రాత్రివేళ బయట కూర్చొంటే దోమలతో ఇబ్బందిగా మారిందని స్థానికులు పేర్కొంటున్నారు. చిరు వ్యాపారులు, మెకానిక్‌లు దోమల బెడదతో టేబుల్ ఫ్యాన్లు ముందు పనులు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. పాడిపై ఆధారపడి జీవించేవారు వేకువ జామున పాలు పితకాలన్నా ఫ్యాన్ పెట్టుకోవాల్సి వస్తోందని వాపోతున్నారు.

పారిశుధ్యం అస్తవ్యస్తం..

వెంకటగిరి మున్సిపాల్టీలో 25 వార్డులున్నాయి. పారిశుధ్య నిర్వహణ కోసం వంద మంది పైగా కార్మికులున్నారు. కాని వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించక డ్రైనేజీలు దోమలకు నిలయంగా మారాయి. మరో వైపు వ్యర్థాలు నిండి పోవడంతో మురుగునీరు ఎక్కడికక్కడే నిలిచిపోతోంది. ఈ పరిస్థితి దోమల వృద్ధికి అనుకూలంగా మారుతోంది. ముఖ్యంగా 14 వార్డు లోని ధర్మాపురం, తోలిమిట్ట, కాశీపేట తదితర ప్రాంతాల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారిందని ఆ వార్డు కౌన్సిలర్ ఆరి శంకరయ్య తరుచూ మున్సిపల్ ఛైర్మన్, మున్సిపల్ కమిషనర్, శానిటరీ ఇన్స్పెక్టర్లకు వినతి పత్రాలు ఇస్తున్నారు. డ్రైనేజీల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు నెల తరబడి శుభ్రం చేయకపోవడంతో కంపు కొడుతున్నాయి. దోమల బెడద రోజురోజుకూ పెరుగుతోంది. అయినా దోమల నివారణ ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదు. దోమల నివారణ చర్యలు కానరావడం లేదని ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఫాగింగ్ యంత్రాలున్నా వినియోగించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ బ్లీచింగ్ పౌడర్ చల్లకపోవడంతో దోమల బెడద పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దోమల నివారణ కోసం పకడ్బందీ చర్యలు చేపట్టకపోవడంతో ప్రజలు అనారోగ్యం బారిన పడే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి, తగు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మున్సిపల్ సమావేశాలు ప్రతినెలా నిర్వహించాలి



వెంకటగిరి మున్సిపల్ సమావేశాలు ప్రతినెలా నిర్వహించేలా మున్సిపల్ ఛైర్‌పర్సన్, కమిషనర్ చర్యలు తీసుకోవాలి. మూడు నెలలకు ఒకసారి నిర్వహించడం వల్ల పారిశుధ్యం, తాగునీరు, మౌలిక వసతుల సమస్యలను కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించలేక పోతు న్నాం..

- ఆరి శంకరయ్య, 14వ వార్డు కౌన్సిలర్, వెంకటగిరి మున్సిపాల్టీ.

జెవివి సేవలు అభినందనీయం


జెవివి ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు అందిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : జన విజ్ఞాన వేదిక సేవలు అభినందనీయమని జెవివి ఉపాధ్యక్షులు చెంచు నారాయణ పేర్కొన్నారు. జెవివి ఆధ్వర్యంలో గూడూరు పట్టణంలోని సొహెచ్ పేట వద్దనున్న పెట్రోల్ బంక్ దగ్గర ప్రత్యేక ప్రతిభావంతులకు నారాయణ కూరగాయలు, గుడ్లు పంపిణీ చేశారు. దాత డాక్టర్ కుదుముల వెంకటనారాయణ ఆర్థిక సాయంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జెవివి ఉపాధ్యక్షులు చెంచు నారాయణ మాట్లాడుతూ వెంకట నారాయణ మా జనవిజ్ఞాన వేదిక ద్వారా అనేక కార్యక్రమాలకి తోడ్పాటు అందిస్తు న్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవరచు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, రాధయ్య, గుర్రం విజయబాబు, చెంచు నారాయణ, సుబ్బారావు, ఆనంద్, సాయి కిరణ్, శ్రీనివాస ఆచారి, తిరశాల శంకరయ్య సుధీర్, నారాయణ, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మద్యం, మత్తు పదార్థాలను అరికట్టాలి..

ప్రజాశక్తి - క్యాంపస్ : నేటి బాల్యాల్లో, యువతలో నేర ప్రవృత్తికి కారణమవుతున్న మద్యం, మత్తు పదార్థాలను అరికట్టాలంటూ పిడిఎస్‌ఓ ఆధ్వర్యంలో తిరుపతి బాలికల వసతి గృహంలో ఆదివారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌ఓ జిల్లా కార్యదర్శి ఆర్ ఆష మాట్లాడుతూ నేడు రాష్ట్రంలో నేరాలకు పాల్పడుతున్న వారిలో అత్యధికంగా మద్యం, మత్తు పదార్థాలకు బానిసలైన మైనర్లు, యువత ఉండటం గమనార్హం అన్నారు. హత్యా అత్యాచారాలు జరిగినప్పుడల్లా ప్రభుత్వం మొసలి కన్నీరు కారుస్తోంది తప్ప మళ్లీ మళ్లీ పునరావృతం కాకుండా ఉండటానికి ఎలాంటి చర్యలు చేపట్టడం లేదన్నారు. ఈ పరిస్థితి ఎటువంటి పర్యవసానాలు ఉంటాయో తెలియని పసి మనసులు నేడు మద్యం, మత్తు పదార్థాలకు, సినిమాలలో అసభ్య దృశ్యాలకి, పోర్న్ సైట్లకి, ఆన్‌లైన్ గేమ్‌లకి బానిసలవుతున్నారు. రేపటి పౌరులుగా ఎదగాల్సిన బాలలు నేడు నేరస్థులవుతున్నారు. మద్యం, మత్తు పదార్థాలను, విష సంస్కృతిని కట్టడి చేయాల్సిన ప్రభుత్వం నేడు చోద్యం చేస్తోందని, ప్రభుత్వం ఇప్పటికైనా మేలుకొని మైనర్లలో, యువతలో నేర ప్రవృత్తిని పెంచుతూ మహిళలపై, చిన్నారులపై హత్యలకు, అత్యాచారాలకు కారణమవుతున్న మద్యం, మత్తు పదార్థాలను నిషేధించాలని కోరారు. జిల్లా నాయకులు ప్రవతి మాట్లాడుతూ రాష్ట్రంలో బలమైన చట్టాలు, దిశ యాప్‌లు ఏవీ చిన్నారులపై, మహిళలపై జరుగుతున్న హింసను అరికట్టలేకపోతున్నాయన్నారు. మద్యం, మత్తు పదార్థాలను నిషేధం చేయడం ఒకటే దీనికి శాశ్వత పరిష్కారం అన్నారు. ఆ వైపుగా విద్యార్థి యువకులు ప్రభుత్వాన్ని డిమాండు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మాధవి, గాయత్రి, విద్యార్థినులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆర్థిక సాయం



ప్రజాశక్తి-నాయుడుపేట: స్నేహం ఎప్పటికీ మారిపోదని ఎన్నేళ్ళ గడచినా స్నేహం ఎల్లప్పుడూ చిరస్థాయిగే ఉంటుందని నాయుడుపేటకు చెందిన కొందరు పూర్వ విద్యార్థులు నిరూపించుకున్నారు. తమతో కలిసి చదువుకుని ప్రస్తుతం అనారోగ్యం కారణంగా బాధపడుతున్న వారి మిత్రుడు షేక్ సిరాజ్‌కు పూర్వ విద్యార్థులు ఆర్థిక సాయం అందించి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. నాయుడుపేట జిల్లా పరిషత్ హైస్కూలులో సుమారు 40 సంవత్సరాల క్రితం 1982లో 10వ తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు తమతో కలసి చదువు కొని నేడు అనారోగ్యంతో బాధపడుతున్న షేక్ సిరాజ్‌కు 45 వేల రూపాయలు నగదు సాయం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలూరు శ్రీనివాసులు, చిట్టేటి చంద్రయ్య, శేషం ముని మనోహర్, కాశీవిశ్వనాథం శ్రీనివాసులు, కెయం బాలాజీ, ఎం సిద్దయ్య, జి భాస్కర్, షేక్ రహమత్ బాష పాల్గొన్నారు. ఇదేవిధంగా తమ స్నేహితుడు గొట్టిముక్కల శ్రీనివాసాచార్యులు మృతి చెందారని, తమ స్నేహానికి గుర్తుగా ఆయన కుటుంబానికి తమ వంతు సాయంగా ఆయన భార్యకు 45 వేల రూపాయలు త్వరలో అందించనున్నట్లు స్నేహితులు తెలిపారు.

విద్యార్థుల వన సందర్శన

ప్రజాశక్తి - రేణిగుంట: కేశవరెడ్డి ఈఎం స్కూలు విద్యార్థులకు ప్రకృతి పరిచయ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు, ప్రకృతి రమణీయం' అనే నాటిక నృత్యాలు, వన సందర్శన , రకరకాల మొక్కల పరిచయం, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులతో పాటు, ఉపాధ్యాయులు వన సందర్శన చేశారు. విద్యార్థులకు రకరకాల మొక్కలను పరిచయం చేసి మన నిత్య జీవితంలో ఎలా ఉపయోగ పడతాయో వివరించారు. విద్యార్థులు 'వన సందర్శన' కార్యక్రమాన్ని చాలా చక్కగా ఆనందించారు. ఈ సందర్భంగా కేశవరెడ్డి విద్యా సంస్థల ఫౌండర్, ఛైర్మన్ కేశవరెడ్డి మాట్లాడుతూ మానవుని జీవితం ప్రకృతితో ముడిపడి ఉందని ప్రకృతి లేనిదే ప్రాణి లేదని, మన జీవన విధానం ప్రకృతితో విడదీయ రాని బంధం ఏర్పడి వుందని, మానవుడు జీవించడానికి, ప్రాణవాయువు ఎంతో అవసరమని, గాలి, నీరు, అగ్ని, ఆకాశం, భూమి, వీటిని సరిగా ఉపయోగించుకుంటే మానవుని జీవితం అద్భుతంగా ఉంటుందన్నారు. ప్రకృతిలో, రక రకాల మొక్కలు, వనమూలికలు, మానవుని ఆరోగ్య వంతుడిని చేయడంలో కీలక భూమిక పోషిస్తాయని ఎన్నో రకాల వృక్షాలు ద్వారా 'వన ఔషధాలు' సంతరిస్తాయని, చెట్ల నుండి వచ్చే ఆక్సిజన్, ప్రాణ వాయువుగా మారి మానవునికి జీవితాన్నిస్తాయని, విద్యార్థులకు చిన్ననాటి నుంచే, ప్రకృతిని పరిచయం చేసి ప్రకృతి పట్ల వారి బాధ్యతను గుర్తు చేయడం చాలా శుభ పరిణామం అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, పాల్గొన్నారు.

ఎల్లమ్మకు ఎమ్మెల్యే సారె


సారె తీసుకెళుతున్న ఎమ్మెల్యే నాని దంపతులు

ప్రజాశక్తి -రామచంద్రాపురం (చంద్రగిరి): చంద్రగిరి మూలస్థాన ఎల్లమ్మకు ఎమ్మెల్యే పులివర్తి నాని, సుధా రెడ్డి దంపతులు ఆదివారం సారె సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. తాము అఖండ విజయం సాధించడంతో సారె తీసుకొచ్చిన ఎమ్మెల్యే దంపతు లకు ఆలయ కార్యనిర్వహణ అధికారి పుట్ట రామకృష్ణా రెడ్డి, అర్చకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అమ్మవారి సారెను తీసుకొచ్చిన ఎమ్మెల్యే దంపతులతో పాటు నాయకులకు దర్శనం కల్పించి శేష వస్త్రాలు బహూకరించి, ఆశీర్వచనాలతో తీర్థ ప్రసాదాలు అందిం చారు. ఆలయ పునఃనిర్మాణ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. పలు అంశా లపై అధికారులతో చర్చించారు. నిధులు ఎంతైనా పరవా లేదని ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. నిధులు ఎంతైనా తాము సమ కూర్చుతామని తెలిపారు. ఆలయంలో శిల్పకళ ఉట్టిపడే లా పనులు చేయాలని సూచించారు.

కుంభాభిషేక మహోత్సవ కమిటీ ఏర్పాటు

మూలస్థాన ఎల్లమ్మ పునర్నిర్మాణ పనులు ఆఖరి దశలో ఉండటంతో అమ్మవారి కుంబాభిషేక మహోత్సవ కమిటీని ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే నాని ప్రకటిం చారు. ఈ కమిటీకి అధ్యక్షులుగా మొక్కల చంద్రశేఖర్ రెడ్డి (యంసిఆర్) ని, కమిటీ సభ్యులుగా ఎం గోపి, ఆర్ వెంకట ముని, కె దుర్గా, డి మునికృష్ణమ నాయుడు, పి పాపమ్మ, జి దేవి, ఎం గోపాల్ రెడ్డి, యు భారతి లను నియ మిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కుంభా భిషేక మహోత్సవ కమిటీ అందరితో ఐకమత్యంగా వుంటూ ఘనంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు వి సుబ్రహ్మణ్యం నాయుడు, వి రమేష్ రెడ్డి, లంకెల లలిత సక్కూరి ధనుంజయ రెడ్డి, మునిరత్నం రాయల్, వేణు గోపాల్, లోకాద్రి నాయుడు, అమ్ములు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

బలిజ సంఘం భవనానికి విరాళం


బలిజ సంఘ భవనానికి విరాళం ఇస్తున్న దాతలు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరులో నిర్మిస్తున్న బలిజ సంఘం భవనానికి దాతలు రూ.2 లక్షలు ఆదివారం విరాళంగా అందించారు. పుత్తూరు మండల బలిజ సంఘం అధ్యక్షులు పసుపులేటి శివయ్య అధ్యక్షతన ఆ సంఘం సమావేశం నిర్వహిం చారు. పట్టణంలో నిర్వహించే ద్రౌపది దేవి ధర్మరాజులు బ్రహ్మోత్స వాల్లోఅలుగు ఉత్సవాన్ని బలిజ సంఘం ఘనంగా నిర్వహించాలని పుత్తూరు బలిజ సంఘం అధ్యక్షుడు పసుపులేటి శివయ్య ఈ సందర్భంగా పేర్కొన్నారు. పట్టణంలో బలిజ సంఘం భవన నిర్మాణం పూర్తి అయిన తరణంలో సంఘ భవనం ప్రారంభోత్సవం ఆగస్టు 9వ తేదీన ప్రారంభించాలని అందరూ ఆమోదం తెలిపారు. పుత్తూరుద్రౌపది దేవి ధర్మరాజుల తిరునాలలో బలిజ కులస్తుల ఆధ్వర్యంలో నిర్వహిం చే అలుగు ఉత్సవం ఘనంగా నిర్వహించాలని అందరూ ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఇ. గోపిరాయల్, వెంకటేష్, వెంకటసుబ్బయ్య, డి జయ ప్రకాష్, కృష్ణయ్య, విక్కీ రాయల్, మునయ్య, మెరుపుల మహేష్, ఎల్ జి రవికుమార్, సూర్యనారాయణ, మండలంలోని పట్టణంలోని బలిజ కులస్తులు, నాయకులు పాల్గొన్నారు.

'హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి'

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: హమాలీ కార్మికులకు సంక్షేమ ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ డిమాండ్ చేశారు. హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా సమావేశం ఆదివారం బైరాగి పట్టెడ లోని ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో నాగరాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా వచ్చిన రాధాకృష్ణ, ఆ సంఘం వర్కింగ్ ప్రసిడెంట్ ఎన్‌డి రవి మాట్లాడుతూ హమాలీ కార్మికులకు ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల తరహాలో సంక్షేమ చట్టం మాదిరిగా హమాలీ కార్మికులకు కూడా సంక్షేమ చట్టాన్ని ఏర్పాటు చేయాలని, 45 ఏళ్ల దాటిన ప్రతి ఒక్కరికి కేరళ ప్రభుత్వ తరహాలో 6వేల రూపాయల పింఛను అందివ్వాలని, అందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని, నాణ్యమైన యూనిఫామ్‌ను ప్రభుత్వం ఇవ్వాలని, కార్పొరేట్ హాస్పిటల్ లో వైద్యం ఉచితంగా అందివ్వాలని కోరారు. ఈ సమావేశంలో ఆ సంఘం జిల్లా కార్యదర్శి బాబు సాంబయ్య, చిన్నబ్బ పాల్గొన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయుడికి ఘన సన్మానం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని శ్రీ సరస్వతీ శిశు మందిరం పాఠశాలలో గురు పౌర్ణమి (వ్యాస పౌర్ణమి) సందర్భంగా విశ్రాంత ఉపాధ్యాయులు వెంకట రమణారెడ్డి ని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల అధ్యక్షులు మల్లెమాల మురళి రెడ్డి , సహ కార్యదర్శి మయూరి శ్యామ్ యాదవ్ మాట్లాడుతూ గురు పౌర్ణమి విశిష్టత గురించి వివరించారు. సమాజంలో గురువు అవశ్యకత గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సమితి సహ కారదర్శి యస్వియల్ ప్రసాద్ సిహెచ్‌వెంకట రమణయ్య , ఆర్. రవిచంద్ర రెడ్డి రూపేష్ రెడ్డి ఆర్‌విరావు , ప్రధానచార్యులు రంగనాయకులు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరేటమ్మకు ఇత్తడి ఉయ్యాల వితరణ


ఇత్తడి ఉయ్యాలను వితరణ చేస్తున్న దాతలు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: స్థానిక అరేటమ్మ దేవా లయానికి రవి కుమార్, లోకేశ్వరి దంపతులు ప్రతి పౌర్ణమికి ఆరేటమ్మ దేవాలయంలో ఊంజల సేవ నిర్వహణకు 25వేలా ఆరు వందల రూపాయలు విలువ చేసే ఇత్తడి ఉయ్యాలను వితరణగా ఆలయ నిర్వాహకులకు ఆదివారం అందించారు. ఈ సందర్భంగా ఎల్‌జి రవికుమార్ మాట్లాడుతూ గతంలోనూ ఆలయ ప్రాంగణంలో శిలాఫలకం ఏర్పాటుకు, ప్రహరీ గోడలు, గ్రిల్స్ నిర్మాణానికి, టైల్స్ వేసేందుకు ఆలయ అభివృద్ధికి ఆర్థికసాయం చేశామని అందులో భాగంగా ప్రతి గురుపౌర్ణానికి ఊంజల సేవ నిర్వహణకు ఉయ్యాలను వితరణ చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

నాడార్‌లను బిసి కేటగిరిలో చేర్చేందుకు కృషి: ఎమ్మెల్యే

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: నాడార్లను బీపీ కేటగిరీలో చేర్చేందుకు కృషి చేస్తానని తిరుపతి ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు తెలిపారు. కామరాజ్ నాడార్ 122వ జయంతి వేడుకలను తిరుపతి నాడార్ వెల్ఫేర్ అసోషియేషన్ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ కాలనీలోని నాడార్ కళ్యాణ మండపంలో ఈ వేడుకలు నిర్వహించారు. నాడార్ వెల్ఫేర్ అసోషియేషన్ అధ్యక్షులు శివస్వామి నాడార్ మాట్లాడుతూ తమిళనాడులో నాడార్ కులం బిసిగా పరిగణిస్తున్నారని రాష్ట్రంలో కూడా బిసిలుగా నాడార్ లను గుర్తించాలని కోరారు. తమిళ మీడియం స్కూల్ ను తిరుపతిలో పునఃప్రారంభించాలని ఆయన కోరారు. నాడార్ కళ్యాణమండపం అనుకుని మద్యం షాపు ఉందని దీన్ని తొలగించాలని ఆయన కోరారు. కామరాజ్ నాడార్ బడుగు, బలహీన వర్గాలకు విద్యా, సామాజిక రంగాల్లో ప్రాధాన్యత కల్పించడంలో ఆయన విశేషకృషి చేశారని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. కామరాజ్ నాడార్ మూడు సార్లు ముఖ్యమంత్రిగా ఉన్నా చనిపోయేనాటికి నూటముప్పయ్ రూపాయలు మాత్రమే ఉన్నాయంటే ఆయన ఎంతటి సాధారణ జీవితాన్ని గడిపారో అనడానికి నిదర్శనమని ఆయన చెప్పారు. నాడార్ లను బిసీల్లో చేర్పించే అంశాన్ని సిఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. తమిళ మీడియం స్కూల్ ను నగరంలో పునఃప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటా మని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, మన్యం శ్రీనివాసులు, కార్పొరేటర్ అన్నా అనితా యాదవ్, అన్నా మల్లీశ్వరి, బిజెపి నాయకులు నవీన్ కుమార్ రెడ్డి, జనసేన నాయకులు అత్తులూరి భాను, కృష్ణకాంత్, వంశీ, జిలానీ, నాడర్ వెల్ఫేర్ అసోషియేషన్ ప్రతినిధులు తంగరాజ్ నాడార్, ఉదయ సూర్యన్ పాల్గొన్నారు.

డ్రాగన్ ఫ్రూట్స్ దిగుబడి తక్కువ.. గిరాకీ ఎక్కువ..



ప్రజాశక్తి- బుచ్చినాయుడు కడ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ మండలంలో సంప్రదాయ పంటలను వదలి లాభాలనిచ్చే డ్రాగన్ ఫ్రూట్ సాగు చేస్తూ రైతులు రమణారెడ్డి, గజేంద్రనాయుడు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఏడాదికి ఎకరాకు రూ.లక్షల ఆదాయం పొందుతూ ఒకసారి సాగు చేస్తే 30 ఏళ్ల వరకు దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు. బుచ్చినాయుడు కండ్రిగ మండలంలో విదేశాల్లో సాగు చేసే డ్రాగన్ ఫ్రూట్ ప్రస్తుతం మండలంలోని కాటూరు, పూసలపల్లి గ్రామాలకు వచ్చింది. దీంతో డ్రాగన్ పండ్ల తోటల సాగు ఇప్పుడు అందరి చూపును ఆకర్షిస్తోంది. శ్రీకాళహస్తి–తడ రహదారికి ఆనుకుని కాటూరు గ్రామం వద్ద కొత్తరకం పంట సాగు చేస్తుండడంతో వాహదారులు, ప్రయాణికులు పండ్ల తోటను ఆసక్తిగా తిలకిస్తున్నారు. మండలంలోని గాజులపెళ్లూరు గ్రామంలోని రాసా జ్యూస్ ఫ్యాక్టరీ యాజమాని రైతు రమణారెడ్డి కాటూరు రెవెన్యూలో తనకున్న ఆరు ఎకరాల పొలంలో, పూసలప ల్లికి చెందిన రైతు గజేంద్రనాయుడు 10 ఎకరాల్లో డ్రాగన్ ఫ్రూట్ సాగు చేస్తున్నారు. సాధారణంగా మొక్కలు నాటిన రెండేళ్లకు పండ్లు దిగుబడి రావాల్సి ఉండగా రైతులు రమణారెడ్డి, గజేంద్రనాయుడు నాణ్యమైన మొక్కలు, సరైన పద్ధతులు చేపట్టడంతో నాటిన 11 నెలలకే పండ్ల దిగుమతి మొదలైంది. రైతులు మాట్లాడుతూ వరి, వేరుశనగ పంటల సాగులో ఆశించిన లాభాలు రాక, నష్టాలు ఎదురవుతుండడంతో ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించినట్లు తెలిపారు. అందులో ఖరీదైన పండ్లు కిలో రూ.200 నుంచి 400 వరకు ధర కావడంతో పాటు ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరంగా ఉండడంతో ఈ పండ్ల సాగు ఎంచుకున్నట్లు తెలిపారు. ఎకరాకు రూ.6 లక్షల వరకు పెట్టుబడి కింద ఖర్చు చేసినట్లు, ఒకసారి దిగుబడి మొదలైతే 30 సంవత్సరాల వరకు ఫలితాన్ని ఇస్తుందని తెలిపారు. పూర్తి స్థాయిలో దిగుబడి వస్తే ఏడాదికి ఎకరాకు రూ.2 లక్ష ఆదాయం వస్తుందన్నారు. తాను సాగు చేయడమే కాకుండా తమ గ్రామంలోని ఆసక్తి ఉన్న రైతులకు మొక్కలు అందించి సాగు చేసే విధంగా ప్రోత్సహిస్తామన్నారు. పంట దిగుబడి ఇతర రాష్ట్రాల్లో విక్రయించే విధంగా ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. దీంతో పలువురు రైతులు ఈ పంట సాగుపై ఆసక్తి చూపుతున్నారు.

ఘనంగా గురుపూజోత్సవం

ప్రజాశక్తి - క్యాంపస్ : జాతీయ సంస్కృత విశ్వ విద్యాలయం తిరుపతిలో ఆదివారం విశ్వ విద్యా లయంలో వ్యాసుడి విగ్రహం వద్ద గురు పూజోత్సవం నిర్వహించారు. మొట్ట మొదట వ్యాస మహర్షి ప్రతిమకు డాక్టరు అవధాని పూజలు నిర్వహించి గురు పూజోత్సవం నిర్వహించారు. అద్వైత వేదాంత విభాగ అధ్యక్షులు ఐక్యు ఎసి డైరెక్టర్ ప్రొఫెసర్ సతీష్ ఆధ్వర్యంలో గురు పూజోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్ట్రార్ వైవి కృష్ణారావు, విభిన్న విభాగాల అధ్యాపకులు, డాక్టరు కుమార్ బాగేవాడిమఠ్, డాక్టరు మనోజ్ షిండే, డాక్టరు నాగరాజు భట్, విశ్వవిద్యాలయంలోని విద్యార్థులు, రీసెర్చ్ స్కాలర్స్ పాల్గొన్నారు.

తిరుపతి సిటీ: గురుపౌర్ణమి సందర్భంగా రాఘవేంద్రనగర్ షిర్డీ సాయిబాబా గుడిలో నిర్వహిం చిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పాల్గొన్నారు. ఆలయ పాలకమండలి సభ్యులు ఎమ్మెల్యేకి స్వాగతం పలికి స్వామి దర్శనం చేయించారు.అలిపిరి గరుడ విగ్రహం సమీపంలో గురు పౌర్ణమి సందర్భంగా జానపద వృత్తి కళాకారుల సంఘం అన్నదానం నిర్వహించింది. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ తిరుమల నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రక్షాళన మొదలు పెట్టారన్నారు. టిటిడి ధర్మప్రచార పరిషత్ గత ఐదేళ్లలో నిలిపేసిన సంప్రదాయలన్నింటిని పునరుద్దరి స్తామని తెలిపారు. జానపద కళాకారుల సమస్యలను సిఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌ల దృష్టికి తీసుకెళ్లి పరిష్కా రానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్ర మాల్లో టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జి శ్రీహరి నాయుడు, మహేష్ యాదవ్, జానపద వృత్తి కళాకారుల జాతీయ అధ్యక్షులు యాదగిరి, కార్యదర్శి ముని, జనసేన నాయకులు నరసింహులు నాయుడు, రాజారెడ్డి పాల్గొన్నారు.

పిచ్చాటూరు: పిచ్చాటూరు మండలం రామగిరి అంకాల పరమేశ్వరి ఆలయంలో గురుపౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. రామగిరికి చెందిన శివయ్య నాయుడు ఉభయదాతగా వ్యవహరించారు.

రామచంద్రాపురం (చంద్రగిరి): చంద్రగిరి శ్రీ షిరిడి సాయిబాబా ఆలయంలో గురు పౌర్ణమి మహోత్సవ వేడుకల సందర్భంగా ఆదివారం పండ్లు, పూలతో పాటు పట్టు వస్త్రాలను చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, పులివర్తి సుధా రెడ్డి దంపతులు సమర్పించారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదా లను అందించి ఆశీర్వదించారు. ఈ గురు పౌర్ణమి వేడుకలలో ఆలయ పెద్దలు, కమిటీ సభ్యులు, భక్తులు, కూటమి పార్టీల నాయకులు, పాల్గొన్నారు.

ఎంబీయూలో ప్రత్యేక పూజలు

మండలంలోని ఏ రంగంపేట వద్ద ఉన్న మోహన్ బాబు విశ్వవిద్యాలయంలో షిరిడి సాయిబాబా మందిరంలో గురు పౌర్ణమి సందర్భంగా సినీ నటుడు మోహన్ బాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టు వస్త్రాలు, వివిధ రకాల పుష్పాలతో విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు ఎంబీయూ ఛైర్మన్ మోహన్ బాబు అన్న ప్రసాదాలు అందించారు.

నాయుడుపేట: నాయుడుపేట పట్టణంలోని అగ్రహారపేటలో షిరిడి సాయిబాబా ఆలయంలో ఆదివారం గురు పూర్ణమి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాయి బాబా ఆలయ కమిటీ అధ్యక్షులు దాసరి ప్రభాకర్ నాయుడు, కార్యదర్శి సిహెచ్ శ్రీధర్ కుమార్, కోశాధికారి పూనాటి తిరుమల నాయుడు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న షిరిడి సాయిబాబా మందిరంలో గురు పౌర్ణమి వేడుకలు నిర్వహించారు. చిన్నారులు ప్రదర్శించిన భక్తి గీతాలు కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గూడూరు పురపాలక పరిధిలోని చెన్నూరు సాయి బాబా మందిరంలో గురు పౌర్ణమి సందర్భంగా సాయి బాబాకి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

పుత్తూరు టౌన్ : పుత్తూరు పట్టణంలోని స్థానిక శిరిడి సాయిబాబా నిత్యాన్నదానం సాంఘిక సేవ సంఘంలో గురు పౌర్ణమి సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం వంద మందికి అన్నదానం నిర్వహించారు. ఆలయం లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు సభ్యులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి వితరణ

ప్రజాశక్తి- తిరుపతి డెస్క్: ఏర్పేడు మండలం చిందేపల్లి ఎస్టీ కాలనీలో యువ నేస్తం అసోసియేషన్ ఆధ్వర్యంలో పిల్లలకు దాతల సహకారంతో విద్యా సామగ్రి, ఒక జత దుస్తులు పంపిణీ చేశామని యువ నేస్తం అసోసియేషన్ అధ్యక్షులు మధురాంతకం మునిశేఖర్, ట్రస్ట్ అధ్యక్షులు వినోద్ లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువ నేస్తం అసోసియేషన్ మండల కోఆర్డినేటర్ అరుణ, వాలంటీర్లు మౌనిక పాల్గొన్నారు.

చెవిరెడ్డి విమర్శలు మానుకోవాలి

జిల్లా టిడిపి బిసి సెల్ అధ్యక్షులు షణ్ముగ రెడ్డి


మాట్లాడుతున్న టిడిపి జిల్లా బిసి సెల్ అధ్యక్షులు షణ్ముగంరెడ్డి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : చంద్రగిరిలో ఎమ్మెల్యే పులివర్తి నానిని ఎదుర్కో లేని చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి దిగజారుడు మాటల తో విమర్శించడం మానుకోవాలని టిడిపి జిల్లా బిసి సెల్ అధ్యక్షులు షణ్ముగం రెడ్డి పేర్కొన్నారు. పుత్తూరు టిడిపి కార్యాల యంలో బిసి నాయకులతో ఆయన ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా షణ్ముగం రెడ్డి మాట్లాడుతూ వెనుక బడిన తరగతుల ఆర్థిక, రాజకీయ, సాధికారత కోసం ఆవిర్భ వించిందే టిడిపి అన్నారు. టిడిపి ఒక బిసినాయకుడిని గుర్తించి జిల్లా పార్టీ అధ్యక్షుడిగా చేస్తే స్వాగతించాల్సింది పోయి మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామ చంద్రా రెడ్డి సిఫార్సు మేరకే టిడిపి జిల్లా అధ్యక్ష స్థానాన్ని సిఆర్ రాజన్‌కి కట్టబెట్టారని చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి చెప్పడం అతను దిగజారిన రాజకీయానికి నిదర్శనం అన్నారు. సిఆర్ రాజన్ పెద్దిరెడ్డికి ప్రియ శిష్యుడు అయితే వైసిపిలో శాసనసభ టికెట్ ఎందుకు ఇవ్వలేదో చెవిరెడ్డి సమాధానం ఇవ్వాలన్నారు. వారికి చిత్తశుద్ధి ఉంటే సీఆర్ రాజన్ చేసిన సేవలను గుర్తించి శాసనసభ టికెట్ ఇప్పించకపోగా కనీసం ఒక బీసీ నాయకుడుగా మీ పక్కన కూర్చోబెట్టలేదు.. చంద్రగిరిలో మీరు చేసిన దౌర్జన్యాలను, అరాచకాలను, భూ దందాలను, చూడలేకే వైసిపి వదిలి టిడిపిలో సీఆర్ రాజన్ చేరాడని తెలిపారు. ఈ సమావేశంలో పుత్తూరు పట్టణ టిడిపి ఉపాధ్యక్షులు ఏలుమలై రెడ్డి, టిఎన్‌టియుసి జిల్లా కార్యదర్శి పండారం మణి, పుత్తూరు పట్టణ బీసీ సెల్ ఉపాధ్యక్షులు సంతోష్, రెండవ వార్డు ఇన్‌ఛార్జి కాశీ, చిదంబరం, మహేష్ పాల్గొన్నారు.